# 17

# పిట్ట నేర్పిన పాఠం

అనగనగా నేపాళ దేశంలో ఒక రాజుగారుండేవారు.

ఆయన ఒకసారి సూర్యోదయానికి ముందేలేచి, తన ఉద్యానవనంలో విహారానికి వెళ్లారు. ఎచ్చటనుంచో కమ్మని సంగీతం వినిపించింది.

'అది పాడుతోంది ఎవరా..?' అని చాలాసేపు ఆయన వెతికాడు కాని, ఎవరూ కనిపించలేదు. పైగా... ఆ పాటలోని భాషకాని, భావంకాని ఆయనకు అర్థంకావడంలేదు.

ఇంతలో... సూర్యోదయం అవుతుండడంతో ఆ సంగీతం కూడా ఆగిపోయింది. నిరాశగా తిరిగివచ్చాడు రాజుగారు.

ఆ సాయంత్రం మళ్ళీ తోటలోకి వెళ్లారు రాజుగారు.

సూర్యాస్తమయం అవుతుండగా... తిరిగి ఆ సంగీతం వినిపించింది.

రాజుగారు వెంటనే తన పరివారాన్ని- ఆ పాడుతున్న వారిని వెతకడం కోసం పంపించి ఆ శబ్దం వస్తున్న దిశగా వెళ్లి తానూ వెతకసాగాడు. కాని, ఎవరికీ ఆ పాట పాడుతున్నదెవరో తెలియలేదు.

మర్నాడు రాజుగారు కొలువు తీర్చిన సమయంలో ఈ విషయం తెలిపి ఆ పాట పాడుతున్న వారిని తీసుకువచ్చిన వారిని ఘనంగా సన్మానిస్తానని ప్రకటించారు.

రాజుగారి బహుమతి అందుకోవడం కోసం అనేకమంది అన్వేషణ ప్రారంభించారు.

అన్వేషిస్తున్న వారిలో ఒక బృందం కంట ఒక కప్ప కనబడింది. వారు "కప్పా-కప్పా... రాజుగారిని సమ్మోహనపరచే గానం చేసినదెవరో నీకు తెలుసా?" అని అడిగారు.

"ఎవరో ఏమిటి..?... నేనే!" అంది బెకబెక లాడుతూ.

వెంటనే వారు ఆ కప్పను తీసుకొని రాజుగారి ముందు ప్రవేశపెట్టారు.



రాజుగారి ఆజ్ఞప్రకారం ఆ కప్ప తన గానాన్ని ప్రారంభించింది.

ఆ బెక బెకలు వినగానే రాజుగారికి పట్టరాని కోపం వచ్చి దానిని వీధిలోకి విసిరేయించాడు.

ఆ తర్వాత మరో బృందానికి ఒక నల్లని పిట్ట కనిపించింది. ఆ పాట పాడుతున్నది తానేనని ఆ పిట్ట చెప్పడంతో వారు దానిని తీసుకువచ్చి సభలో రాజుగారి ముందుంచారు.

రాజుగారి కోరిక ప్రకారం అది తన గానం మొదలుపెట్టింది.

వెంటనే రాజుగారు ఆ గానాన్ని గుర్తుపట్టారు. పట్టరాని సంతోషంతో "నువ్వా- ఈ గానం చేస్తోంది! నీ పాటకి అర్థం ఏమిటి?" అని అడిగారు.

"రాజా... ఈ భగవంతుని సృష్టిలో నేను అతి సామాన్యమైన జీవిని. నాలాంటి అల్పజీవిని కూడా సృష్టించిన ఆ భగవంతునికి కృతజ్ఞత తెలుపుతూ నేను సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాల్లో గానం చేస్తూంటాను. నా గానం కేవలం నేను చేసే ప్రార్థన మాత్రమే!" అంది వినయంగా.

పిట్ట పలుకులు రాజుగారికి కనువిప్పును కలిగించినట్లయ్యాయి.

వెంటనే ఆయన "ఓ పిట్టా.... నువ్వు మా కళ్ళు తెరిపించావు. తెలివిగలవారమని విర్రవీగే మేము ఆ సృష్టికర్తను విస్మరిస్తున్నాం. ఇంకముందు నా రాజ్యంలో అందరూ ప్రతిరోజూ రెండుసార్లు దైవప్రార్థన చేస్తారు" అని, ఆ పిట్టని సన్మానించే ఉద్దేశంతో దాని ముక్కుకీ, కాళ్ళకీ బంగారుపూత పూయించాడు.

అప్పటినుండి నేపాళదేశంలో ప్రజలు సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలలో దైవప్రార్థన చేయడం ప్రారంభించారట. ఈ సంఘటనకి గుర్తుగా ఇప్పటికీ అక్కడ కాళ్ళూ, ముక్కూ బంగారురంగు వుండే నల్లని పిట్టలు కనిపిస్తుంటాయట.

★★★

